www.telugubhakti.com

Printer friendly version

**Join Telugu Bhakti Pages group to get updates.
Participate in religious discussions.
Share thrilling religious views and divine experiences.**

**Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/**

# Andhra Chatuvulu – Compiled by Mrs. I Pramila Kumari

**Mrs. I Pramila Kumari is the eldest daughter of late Sri M N Rao, doyen of Telugu Publishing House – M Seshachalam & Co. Being born and brought up among books she became a voracious reader. Her reading ranges from light reading to classics including novels, articles and poems. In one word she has read each and every book published and distributed by her father through Andhra Pradesh Book Distributors. She has done editorial work to Telugu Books. Her memory is so unique that on one instance, she pointed out an imitation of an original work of a great author.**

**Mrs. I Pramila proudly proclaims that her father promoted EMESCO Pocket Books for her sake, being impressed by her reading habit. She has a good collection of all the books published and distributed by her father with a caption 'Here Lives M N Rao'. Just as Wordsworth found a playmate, a friend, a teacher and a philosopher in Nature, She found all these in her books. She returns to her books in every mood and even made them playmate to her daughter.**

**Mrs. I Pramila is a post-graduate in politics from Presidency College, Chennai. Her husband Dr. I Chandra Mohan is Professor in Mathematics in S V University. Their love and affection for Sri M N Rao is so great that they are shortly raising a charitable trust in his name.**

**Mrs. Pramila has been rendering her services to our Telugu Bhakti Pages right from its inception. When we expressed our desire to add 'Telugu Chatuvulu' to our website, she spontaneously came out with many Chatuvulu of many poets. She helped us with her compilation of these from her library in a jiffy. She advised us to enrich our site with Koonalamma Padaalu of Sri Arudra and to allot special pages for children's songs. She provided us the matter required for these in a split second and we are going to post them in subsequent issues.
We thank her from our editorial board and from our readers.**

**Last but not least we express our sincere and heartfelt thanks to Prof. C A Reddy Garu from USA for his keen observation, suggestions, corrections and refinements in this article. May Lord Krishna bless these great people, Smt. I Pramila Kumari Garu and**
**Prof. C A Reddy Garu and their family members with plethora of love!**

**Raghav**
**For Bhakti Pages Team**

# ఆంధ్ర చాటువులు

మ. ఘనుడన్ వేములవాడ వంశజుడ దాక్షారామ భీమేశనం
దనుడన్ దివ్యవిషామృత ప్రకటనానాకావ్య ధుర్యుండ, భీ
మన నా పేరు వినంగజెప్పితి తెలుంగాధీశ ! కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగంబిచ్చి లాలింపురా ॥

ఇది వేములవాడ భీమకవి పద్యంగా ప్రసిద్ధమైంది. ఇతడు తూర్పుగోదావరి జిల్లా దాక్షారామానికి చెందినవాడని, తెలంగాణా ప్రాంతంలోని వేములవాడ వాడని భిన్నవాదాలున్నాయి. నన్నయకు ఇంచు మించు సమకాలికుడని చెప్పవచ్చును.

ఈయన దాక్షారామ భీముని వరం వల్ల పుట్టినవాడని, అసాధారణమైన దివ్య శక్తులు కలవాడని, తన కవిత్వంతో ఎందరినో శిక్షించినాడని గాథలు ప్రచారంలో ఉన్నాయి.

పై పద్యము భీమకవి తెలుంగాధీశునితో, తనకు సుగంధ ద్రవ్యాలిప్పించు మని కోరుతూ చెప్పినది.

చం. హయమది సీత పోతవసుధాధిపుడారయ రావణుండు, ని
శ్చయముగ నేను రాఘవుడ, సహ్యజవారిధి, మారుడంజనా
ప్రియతనయుండు, లచ్చన విభీషణుడా గుడిమెట్ట లంక, నా
జయమును బోతరక్కసుని చావును నేడవనాడు చూడుడీ ॥

భీమకవి ఒకప్పుడు గుడిమెట్ట అనే ఊరికి వెళ్లాడు. అప్పుడతని గుఱ్ఱాన్ని సాగి పోతరాజనే జమీందారు బంధించి ఎంత ప్రార్థించినా విడవలేదట. ఆ సందర్భంలో

చెప్పిన పద్యమిది.

తన గుఱ్ఱం సీత వంటిదని, పోతరాజు రావణుడని, తాను రాముణ్ణని, కృష్ణానది సముద్రమనీ, మారన అనే తన అనుచరుడు హనుమంతుడనీ, లచ్చన అనేవాడు విభీషణుడని, గుడిమెట్ట గ్రామం లంక అనీ రామాయణ పరంగా వర్ణించి,ఏడవ రోజు పోతరాజు మరణం కలుగుతుందని శపించాడట. అమోఘవాక్కైన ఆ కవి మాట నిజమై అతని మరణం, తరువాత అతని బంధువులు ప్రార్థించగా మరల బ్రతికించటం జరిగిందని ఐతిహ్యమున్నది.

ఉ॥ రామునమోఘబాణమును రాజశిఖామణి కంటి మంట యున్
భీముగదావిజృంభణ ముపేంద్రుని చక్రము వజ్రివజ్రమున్
దామరచూలి వ్రాతయును దారక విద్విషు ఘోర శక్తి యున్
వేములవాడ భీమకవి లేశము తిట్టిన రిత్త వోవునే

ఉ॥ నేరుపు బ్రహ్మజేరె నిజనిర్మలతేజము సూర్యుజేరె నా
కారము కాము జేరె నధికంబగు లక్ష్మియనంతు జేరె గం
భీరత వార్థిజేఁరె గలపెంపు కులాద్రుల జేరె గీర్తి దా
నూరట లేక త్రిమ్మరుచు నున్నది మైలమ భీము డీల్గినన్.

మైలమ భీముని నేరుపు బ్రహ్మను చేరింది. తేజస్సు సూర్యుణ్ణి, రూపము మన్మధుణ్ణి, లక్ష్మి విష్ణువును, గాంభీర్యము సముద్రాన్ని, ఔన్నత్యము కులపర్వతాలను చేరాయట. ఆయన మరణం వలన ఇక అతని కీర్తి ఎక్కడ చేరవలెనో తోచక తిరుగు తున్నదట. అనగా నేర్పు మొదలైన గుణాలకు ఆయనకు సమానులుగా చెప్పదగిన బ్రహ్మాదులున్నారు. కాని అతని మరణంతో కీర్తి కాశ్రయం లభించలేదంటే అతనితో సమాన కీర్తి గల మరొక ఆశ్రయమేదీ ప్రపంచంలో లేదని, అతడ సమాన కీర్తి శాలి అని పద్యభావము.

కం॥ రసికుఁడు పోవడు పలనా
డెసఁగంగా రంభయైన ఏకులె వడకున్ ।
వసుధేశుఁడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్ ॥

శ్రీనాథుడు రాజాస్థానాల్లో తిరుగుతూ, భోగవిలాసాలనుభవిస్తూ, రసిక జీవనం గడిపిన వాడు. ఆయన ఒకసారి పల్నాటి ప్రాంతం వెళ్లాడు. అక్కడి ప్రజల ఆహారం, ఆచార వ్యవహారాలు మోటుగా ఉండేవి. పై పద్యంలో ఆ విషయాన్నే పరిహాసంగా రచించాడు. పలనాటిలో రంభ వంటి అందగత్తె కూడ ఏకులు వడుకుతుంది. అక్కడి దొరలు కూడ నాగలి పట్టి పొలం దున్నుతారు. మన్మధునంతకుమారుడు కూడ జొన్నన్నమే తింటాడు అని పద్యభావం. కొన్ని సంవత్సరాల క్రిందటి వరకు పల్నాటి సీమలో వరిధాన్యం పండేది కాదు. జొన్నలు అక్కడ ముఖ్యాహారంగా ఉండేవి.

కం॥ సిరిగలవానికి చెల్లును
తరుణులు పదియారువేల దగ పెండ్లాడన్
తిరిపమున కిద్ద రాండ్రా
పరమేశా ! గంగ విడుము పార్వతి చాలున్ ॥

ఉ॥ బూడిదబుంగవై యొడలు పోడిమి దప్పి మొగంబువెల్లనై
వాడల వాడలం దిరిగి వచ్చెడి వారలు చొచ్చొచోయనన్
గోడల గొంగులందొదిగి కూయుచునుండెడి కొండవీటిలో
గాడిద ! నీవుసుం గవివి గావుగదా! యనుమానమయ్యెడిన్ ॥

ఉ॥ పుల్లసరోజనేత్ర ! యలపూతనచన్నుల చేదు ద్రావి నా
డల్లదవాగ్ని మ్రింగితి నటంచును నిక్కెదవేల! తింత్రిణీ
పల్లవ యుక్త మౌనుడుకుబచ్చలి శాకము జొన్నకూటితో
మెల్లన యొక్క ముద్ద దిగ మ్రింగుము నీపస గాననయ్యెడున్ ॥

" కృష్ణా ! ఆనాడు నీవు పూతన చనుబాల విషాన్ని తాగి హరించుకున్నానని, కార్చిచ్చును నోటిలో మింగి చల్లార్చినానని గొప్పలు చెప్పు కుంటున్నావు. అదేమంత గొప్ప విషయం కాదు. నీకు చేతనైతే జొన్న అన్న ములో, చింత చిగురు వేసి వండిన, బచ్చలి కూరను కలుపుకొని ఒక్క ముద్ద తిని చూడు అప్పుడు నీ సామర్థ్యం తెలుస్తుంది"

ఉ॥ కప్పుర భోగి వంటకము కమ్మని గోదుమ పిండివంటయున్
గుప్పెడు పంచదారయును గ్రొత్తగ గాచిన యాలనే పెస
ర్పప్పును గొమ్మునల్లనటి పండ్లును నాలుగు నైదునం జలున్

లప్పల తోడ క్రొంబెరుగు లక్ష్మణవజ్జలయింట రూకకున్

వినుకొండ వల్లభరాయలదనీ, శ్రీనాథునిదనీ రెండు విధాలుగా చెప్పబడే క్రీఢాభిరామం లో మంచనభట్టు, టిట్టిభసెట్టి దేశాటనం చేస్తున్నప్పుడు ఒక పూటకూటి యింటిలో లభించే భోజనాన్ని వర్ణించే పద్యమిది. ఆ రోజుల్లో వాడుకలో ఉన్న ఒక రూక (రూపాయి) కు లక్ష్మణ వజ్జల అనే అతని పూటకూటింటిలో ఇంత మంచి రుచికర మైన భోజనం పెట్టేవారట. కప్పురభోగి అనే మేలిరకం బియ్యపు అన్నము, గోధుమ పిండి పణ్యారాలు, పంచదార, తాజా ఆవునేయి, పెసరపప్పు, అల్లపుకొమ్ము, అరటి పండ్లు, నాలుగైదు కూరలు, పచ్చళ్లు, కొత్త పెరుగు గడ్డలు, వీటన్నిటితో ఒక రూపాయి కి భోజనం పెట్టేవారట.  ఓరుగల్లు లో తిరుగుతున్నప్పటి వర్ణన ఇది.

చ॥ గడుసరి లోభి యర్థమది కన్నపు దొంగకు బంది పోట్లకున్
బుమిని వారకాంతలకు భూపతికిం జను కోటసింగ । నీ
పడసిన యర్ధ మూర్తుల బాంధవకోటికి యాచకాళికిన్
గుడికిని సత్రశాలకును గూపతటాకవనప్రతిష్ఠకున్

లోకంలో లుబ్ధుని ద్రవ్యము దొంగలకు, బందిపోట్లకు, వేశ్యలకు,రాజుకు చెందుతుంది.  ఓ కోటసింగా !  నీవు సంపాదించిన ధనము బాధలో ఉన్నవారికి, బంధువులకు, యాచకులకు, దేవాలయాలకు, ధర్మశాలలకు, బావులు,   చెరువులు తవ్వించటానికి, తోటలు వేయించటానికి వినియోగించబడుతుంది.  ఆర్జించిన ధనాన్ని సద్వినియోగం చేస్తూ కోట సింగరాజు సార్థక జీవనుడవుతున్నాడని చెప్పి, ధనాన్నెలా ఖర్చు పెట్టాలో ఇతరులకుపదేశం కూడ చేస్తున్నాడీ కవి.

మ. వరబింబాధరము న్పయోధరములు న్వక్రాలకంబుల్మనో
హరలోలాక్షుల జూపకవ్వలి మొగంబైనంత నే మాయె నీ
గురుభాస్వజ్జఘనంబు క్రొమ్ముడియు నాకున్ గల్లవే గంగకి
ద్దరి మేలద్దరి కీడుగల్గునటె ! యుద్యద్రాజబింబానని ॥

చంద్రబింబం వంటి ముఖం కలదానా ! నీ దొండపండు వంటి పెదవులను, నీ వక్షోజా లను, వంకర తిరిగిన ముంగురులను, అందంగా చంచలంగా ఉండే నీ చూపులను నాకు చూపకుండా అటువైపు ముఖం తిప్పి కూర్చున్నావు.  అంత మాత్రంలో నాకేమీ నష్టం జరుగలేదు.  ఎందుకంటే వెనుక భాగం నావైపున్నది కదా! అక్కడ ప్రకాశిస్తూ

బరువుగా ఉండే నీ పిరుదులు, నల్లగా ప్రకాశించే అందమైన నీ కొప్పుముడి నాకు కన్పిస్తూ నన్ను రంజింపజేయటం లేదా ? గంగానదికి రెండు వైపుల ఎక్కడ స్నానం చేసినా పుణ్యమే కలుగుతుంది కాని ఒక వైపు పుణ్యము, మరొ వైపు పాపము కలుగదు కదా ! అలాగే నీ శరీరంలో ముందు, వెనుక గూడ నాకానందాన్ని కలిగించే సౌందర్యశోభలు న్నప్పుడు నీవు కోపంతో ముఖం తిప్పుకున్నా నష్టమేమీ లేదని అతని భావము.

చ॥ స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గె నీ
యతులితమాధురీమహిమ ? హా తెలిసెన్ భువనైకమోహనో
ద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతాపహారిసం
తతమధురాధరోదిత సుధారసధారల గ్రోలుటంజుమీ.

దూర్జటి కవికి ఒక వేశ్యతో సాంగత్యముండేదట. దాన్నాధారంగా చేసుకొని, "అతిలోక సుందరియైన వార వనిత యొక్క తాపహారి అధరామృత రసాన్ని ఆస్వాదించటం చేతనే ఆయన కవిత్వాని కంతటి మాధుర్యం కలిగింది" అని ఆ పూరణలోని భావం.

చ॥ నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
ప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యేలమంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకిన గాక యూరక కృతుల్రచియింపుమటన్న శక్యమే.

అల్లసాని పెద్దనగారు చెప్పిన పద్యమిది. కావ్యం రాయాలంటే ఏయే వసతులుంటే అనుకూలంగా ఉంటుందో దీనిలో చెప్పారు. జన సమ్మర్దం లేని ఏకాంత ప్రదేశం, మధ్య మధ్య ప్రియురాలు దూతిక ద్వారా పంపించే కర్పూర తాంబూలం, మనసుకు నచ్చే రుచికరమైన భోజనం, కూర్చొని ఊగటానికి ఊయల మంచం, తన రచనలో తప్పొప్పులను విచారించగల రసజ్ఞులు, కవి ఆశయాన్ని ఊహతో గ్రహించగలిగిన లేఖకులు, పాఠకులు ఇవన్నీ అమరితే తప్ప ఊరికే కావ్యం వ్రాయండి అనగానే సాధ్యమవుతుందా ? అంటాడు పెద్దన.

చ॥ చదివిన పద్యమందుఁగల సారమెరుంగఁగలేని యజ్ఞుడున్
హృదయము హాయి గన్నను గవీంద్రుని మెచ్చకపోవు కొంటెయున్

బదవి విశేషముండి, కృతి పద్యములూరక కోరు లోభియున్
గద భువి మూఢమూర్ఖజనగార్దభముల్మొగురేకరాశియే.

కం॥ అన్నాతి గూడ హరుడగు
నన్నాతిం గూడ కున్నసురగురుండౌ
నన్నా తిరుమలరాయా
కన్నొక్కటీ లేదుగాని కంతుడు గాడే ?

తన భార్యతో కలిసి ఉన్నప్పుడు ఈయన శివుడౌతాడట. శివునికి మూడు కన్నులు కదా! రాయల భార్యకు రెండు కన్నులు, ఆయనది ఒకటి మొత్తం మూడు కన్నులైనాయి. కనుక శివునంతటివాడు. భార్య వెంట లేనప్పుడీతడు శుక్రాచార్యునంతటివాడు. ఆయనకు ఒక్క కన్ను కదా! తిరుమల రాయలకు ఒక్క కన్ను తక్కువ కాని, లేకుంటే మన్మథుడు కాడా? అని శంకరునితో, శుక్రాచార్యులతో, మన్మథునితో ముగ్గురు గొప్ప వాళ్ళతో పోలుస్తూనే అతని అంగవైకల్యాన్ని సున్నితంగా అపహసించాడు కవి.

చ॥ ఘనతరఘూర్జరీ కుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతి దేట గాక యరచాటగునాంధ్రవధూటి చొక్కపుం
జనుగవ బోలి గూఢమును జాటుతనంబును గాక యుండ జె
ప్పిన యది బో కవిత్వమనిపించు, నగించటుగాక యుంటుదిన్.

కవితలో భావం : గుజరాతీ స్త్రీల స్తనయుగంవలె చాలా గూఢంగా ఉండ కూడదట. అలా అని ద్రావిడ స్త్రీల వక్షోజాల వలె బట్టబయలు కాకూడదట. తెలుగు పడుచుల చనుగవవలె కొంత చాటు, కొంత బయలు అన్నట్లు కావ్య భావం వ్యక్తావ్యక్తంగా ఉంటేనే బాగుంటుందని, అలా కానిచో ఆ కవిత పరిహాస పాత్రమవుతుందని చక్కని ఉపమానాలతో మనోరంజకంగా వర్ణించాడు వెంకట నాథుడు. వాచ్యార్థం ద్వారా కొంత విషయం తోచటంతోపాటు వ్యంగ్యార్థ రూపంలో మరికొన్ని సహృదయ రంజక విషయాలు స్ఫురించినప్పుడే ఆ కవిత ఉత్తమంగా ఉంటుందని భావం.

శ్లో॥ సౌరభ్యంబును బంధచాతురితగన్ శయ్యాచమత్కార శృం
గారంబున్ వివిధార్థముల్సరసపాంగత్యంబు నానాకళా
పారీణత్వము మంజువాగ్విభవమున్ పాంచాలరీతిన్ దగన్
వారస్త్రీ యును బోలె నొప్పవలదా ? వర్ణింప కావ్యం బిలన్.

చ॥ తొలకరి మించుతీవగతి తోప దుకాణము మీదనున్న య
య్యలికులవేణితోఁ దముల పాకుల బేరము లాడబోయి నే
వలచుట కేమి శంకరుని వంటి మహాత్ముఁడు లింగరూపియై
కులికెడు దాని గబ్బి చనుగుబ్బల సందున నాట్యమాడగన్

ఆ మెరుపు తీగ వలె ఉన్న ఆ తరుణి దుకాణంపై కూర్చుంటే ఆమెను చూచి నేను వలచుటలో వింత ఏమున్నది ? అంతటి మహాత్ముడు, మన్మథుణ్ణి జయించిన వాడు అయిన శంకరుడే ఆమెను మోహించి, ఆమె స్తన ద్వయం మధ్యలో లింగ రూపంలో చేరి నాట్యమాడు తుంటే ఇక నావంటి వాడు వలపులో పడటం వింతకాదు కదా'' అని. ఇంతకూ ఆమె లింగధారి యువతి కనుక మెడలో ధరించిన లింగం ఎద పై వేలాడుతున్నది.

ఉ॥ అంగడి యూరలేదు వరియన్నము లేదు శుచిత్వమేమిలే
దంగన లింపు లేరు ప్రియమైన వనంబులు లేవు నీటికై
భంగపడంగఁ బాల్పడు క-పాపరులెవ్వరు లేరు దాతలె
న్నంగను సున్న గాన పల నాటికి మాటికి బోవనేటికిన్.

పలనాడులో గ్రామాల్లో దుకాణాలు లేవు. తినటానికి వరి అన్నం దొరకదు. అక్కడి వారికి పరిశుభ్రత బొత్తిగా లేదు. స్త్రీలు చూడటానికి అందంగా లేరు. అందమై న తోటలు కనబడవు. మంచినీళ్లకు ఎంతో లోతుబావులు తవ్వబాధపడుతున్నందుకు దయ చూపే వారుండరు. దానగుణం కలవారు కూడ లేరు. అటువంటప్పుడు ఏ సౌకర్యములేని పలనాటికి మాటి మాటికి ఎందుకు వెళ్లాలి ?

ఉ॥ సంగతశంఖచక్రముఖసాధన భీషణమూర్తి, యార్తి భి
న్మంగళదాయి చారుకరుణాశుభవీక్షణుడు జ్వాలాంబు భృ
త్తుంగ విలాససంహననధూర్వహు డవ్యయుడీ త్రిలోకి నో
మం గలవాడు నీ మగడు మానిని శ్రీసతి సంతసింపుమా.

చ॥ ఘనగతి నేమి ఘోషమెసగన్ ఋతుపర్ణ రథమ్ము దోలుచున్
మనమున నగ్నియై దరికొనన్ దమయంతి పున: స్వయంవరం
బనియెడి వార్త బాహుకసమాఖ్యుడు నైషధు డావిదర్భకున్
ధనసతి పెండ్లి జూచుటకు దానును నేగెను సత్వరంబుగ్.

ఈ పూరణలో పదాలవిరుపు. శబ్దశ్లేషవంటి చమత్కారాలు లేకుండా కథా పరం గానే చెప్పటం జరిగింది. నలో పాఖ్యానంలో నలుని జాడ తెలిసి కోటానికి విదర్భరాజు దమయంతికి రెండవ స్వయంవరం ప్రకటించగా, దానికి ఋతుపర్ణుడు వెళ్లుతుండగా సారథిగా బాహుకనామంతో నలుడుకూడ వెళ్లినాడు. ఆ కథను తీసు కొని చెప్పటంలో అసంగతేమేమీ లేదు కనుక పూరణం సరిపోయింది.అయితే పూర్వంచెప్పిన సమస్యలో ఉన్నంత చమత్కారం దీనిలో కన్పించదు.

ఉ॥ వండెడి వాని సత్కవిని వైద్యుని మంత్రిని మంత్రవాదినిన్
కొండెము జెప్పువాని రిపుగూడినవాని ధనేశునిన్ ధరా
మండల మేలు వాని దనమర్మమెరింగిన వాని తో వెసన్
ఖండితమాడిన న్మిగుల గండమె వచ్చునదెంతవారికిన్

ఎవరెవరితో జాగ్రత్తగా మెలగవలెనో తెలిపే పద్యమిది. సంఘంలో ఎటు వంటి సంకటాలు కలుగకుండా ఉండాలంటే వంటవానితో, మంచి కవిత్వం చెప్పేవానితో, వైద్యునితో, మంత్రితో, మంత్రగానితో, చాడీలు చెప్పువానితో, తన శత్రువును చేరిన వానితో, ధనవంతునితో, రాజుతో, తన రహస్యాలు తెలిసినవానితో కఠినంగా మాట్లాడి విరోధం పెట్టుకోవద్దు. వంటవానికి కోపంవస్తే ఆహారం లో ఏమైనా కలుపవచ్చు. కవి తో విరోధం కలిగితే కవిత్వంతో తిట్టవచ్చు. వైద్యుడు రోగాన్ని పెంచ వచ్చు అలాగే తక్కిన వారు కూడ వారి వారి రంగాలలో తనకు హాని కలిగించగలరు. అందువలన వారితో వ్యవహరించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండి తనను తాను కాపాడు కోవాలి.

ఉ॥ పట్టు దొలంగు మండ, వెస పాకురు బట్టిన బండ, భర్తచే
పట్టని ముండ, మబ్బునెడ బాసిన యెండ, ప్రపూర్ణ నీరముల్
పట్టని కుండ, యుద్ధమున బాఱదలంచిన రండ, మిత్రులే
పట్టున లేని యండ నగుబాటుకు కారణమౌ ధరాస్థలిన్

'మబ్బు విడిచిన యెండ, మొగుడు విడిచిన ముండ' అని తెలుగులో ఒక సామెత కూడ ప్రసిద్ధంగా ఉన్నది. ఇందులో 'ముండ' అనేది తిట్టుగా వాడబడిందే కానివితంతువు అనే అర్థంలో కాదు. మబ్బు విడిచిన ఎండ 'నగుబాటు' పాలు కావ టం మాత్రం ఆలోచించదగిన విషయమే. అది చురుగ్గా వాడిగా ఉండటం వరకు యథార్థం.

ఉ॥ అచ్చ తెనుంగు బద్దె మొకటైనను గబ్బములోన నుండిన్
హెచ్చని యాడుచుందురని యెన్నుచు నేర్పున బొత్తమెల్లని
ట్లచ్చతెనుంగున న్నొడువ నందుల చందమెరుంగు వారి నిన్
మెచ్చరొ యబ్బురం బనరొ మేలనరో కొని యాడరో నినున్.

శా॥ ఈగల్వోలె ప్రణంబులే వెదకుచు న్నీర్ష్యం బరున్మెచ్చకే
మూగల్వోలె నిరంతరాస్యులగుచున్ మూర్ఖించి తర్కించినన్
వీగన్నేరని దుష్కవుల్ బ్రతుకనీ విక్రాంతులై వారినో
రాగంబోవగనేల సత్కవులు సూర్యా! పద్మినీ వల్లభా.

ఉ॥ పీనస రోగి నిన్ను తిలపిష్ట సమానము చేసినంతనే
వాని వివేక హీనతను వందురనేల కురంగనాభమా
మానవతీకపోలకుచమండలమండిత చిత్రపత్రికా
నూన వితాన వాసనల నుండుట లోకము నిన్నెరుంగదే.

శా॥ నీ బాణంబులు రాల, నీ ధనువు ఖండీభూతమై పోవ, నీ
జాబిల్లిన్ ఫణియంట, నీ బలము లాశావీధి పాలైచనన్
నీ బంట్రోతు తనంబు స్త్రీల యెడనే, నిన్నెవ్వరున్ నవ్వరే
మా బాలామణి నేచబోకు మకటా మర్యాద గా దాత్మజా ॥

ఒక చెలికత్తె కోపంతో మన్మధుణ్ణి శపించే ఉపాలంభన పద్యమిది. నీ బాణాలు రాలి పోను! నీ విల్లు ముక్కలైపోను! నీ చంద్రుణ్ణి పాముకాటేయ! నీ బలగాలు దిక్కుల పాలు గాను! నీ పౌరుషం ఆడవారి విషయంలోనేనా ? ఎవ్వరూ నిన్ను చూచి నవ్వరా? మా బాలామణిని బాధించబోకు ! ఓ మన్మథా ! అది నీకు మర్యాద కాదు సుమా !

ఆ.వె. దాక్షిణాత్య కవులు ద్రాక్షేక్షు మధురస
మాధురీధురీణ మహిత దివ్య
భవ్య కావ్య నవ్య పటువాక్చమత్కార
పటిమ దనరి నట్టి భవ్యులంద్రు.

దక్షిణ దేశంలోని కవులు, ద్రాక్ష, చెరకు, తేనెల వంటి తీయదనంతో కూడిన శ్రేష్ఠమైన, దివ్యమైన, చమత్కారంతో కూడిన కవిత్వం వ్రాయగల చతురులని ప్రభువు

ప్రశంసించిన పద్యమిది.

మ॥ గరళంబుం దిగ మింగినానని మహాగర్వంబుచే నుంటివీ
వరయంగా మునగాల సీమ ఫలితం బై పేరు జెన్నొందు బం
దరు పొట్టీల ప్రసాదముం దిననమీ దన్ శ్రీధరాఖ్యుండవీ
కరణిన్మెక్కకపోతివేని బిరుదుల్గాల్పందగున్ శంకరా ॥

నల్లగొండ జిల్లా చందుపట్ల గ్రామ వాసులు శ్రీ పెరుంబూదూరు రాఘవాచార్యులు గారి పద్యమిది. వారొక సారి కోదాడ ప్రాంతపు మునగాల పరగణాలోని గంగిశెట్టి గూడెం (బరాఖత్‌గూడెం) అనే గ్రామంలో దేవాలయ ఉత్సవ యాజ్ఞికానికి వెళ్లగా, అక్కడి భోజన వ్యవస్థను గూర్చి నర్మగర్భంగా చెప్పిన పద్యమిది. సుమారు 50సంవత్సరాలకు పూర్వం వ్రాసిన పద్యం.సూర్యాపేట కోదాడుల మధ్యనున్న మునగాల పరగణా పూర్వం కృష్ణా జిల్లాలో భాగంగా ఉండేది. అప్పటి కింకా నాగార్జున సాగర నిర్మాణం జరిగి కృష్ణా జలాపారుదల ఆప్రాంతానికి ఏర్పడలేదు. వర్షాధారపు సేద్యం జరుగుతూ ఉండేది.

కం. ఖగపతి అమృతముతేగా
భుగభుగమని చుక్క యొకటి భూమిని వ్రాలెన్
పొగ చెట్టై జన్మించెను
పొగత్రాగని వాడు దున్నపోతైపుట్టున్

ఇది ఒక ధూమపాన ప్రియుడు చెప్పిన చమత్కార పద్యము. పూర్వం గరుత్మంతుడు క్షుద్రాపుత్రుల కోసం స్వర్గం నుండి అమృత భాండాన్ని తెచ్చేటప్పుడు ఒక అమృత బిందువు రాలి నేలమీద పడిందట. అది పడ్డ చోట పొగాకు చెట్టు మొలిచిందట. అందువలన ఆ పొగాకుతో చుట్ట, బీడీ మొ॥ తయారు చేసి పొగపీల్చని వాడు తరువాతి జన్మలో దున్నపోతుగా పుట్తాడని హాస్యంగా చెప్పబడింది.

ఉ॥ వాసన లేని పూవు బుధవర్గము లేని పురంబు నిత్యవి
శ్వాసము లేని భార్య గుణవంతుడు గాని కుమారు డున్నద
భ్యాసము లేని విద్య పరిహాస ప్రసంగము లేని వాక్యమున్
గ్రాసము లేని కొల్వు కొరగానివి పెమ్మయసింగధీమణీ.

ఈ పద్యంలో, వాసనలేని పూవువలె పండితులు లేని పట్టణం, భర్తయందు వి శ్వాసం లేని భార్య, మంచిగుణాలు లేని కొడుకు, చక్కగా అభ్యాసం చేయని విద్య, మధ్య మధ్య నవ్వు పుట్టించే పరిహాసం లేని సంభాషణ, జీతభత్యాలు లేని ఉద్యోగ ము ఇవన్నీ పనికిరానివి, నిష్ఫలాలు అని ఒక జాబితాగా చెప్ప బడ్డాయి.పూవుఅందంగా ఉన్నా, దానికి పరిమళముంటేనే విలువ కదా! అదేవిధంగా తక్కినవన్నీ పైన చెప్పిన విధంగా ఉంటేనే రాణిస్తాయని భావం.

ఉ॥ సత్యము లేని చోటఁ దను సమ్మతి చెందని చోట సాధు సాం
గత్యములేని చోట, ధనకాంక్షమునింగిన చోట, శత్రు రా
హిత్యము లేని చోట, ఋణమీయని చోటను గాపురంబు దా
నిత్యము ఁ జేయరాదు సుమి నిక్కము పెమ్మయ సింగధీమణీ

నిజాయితీ లేని చోట, తనకు ఆమోదం కాని ప్రదేశంలో, మంచి వారి సహ వాసం లభించని చోట, జనులంతా డబ్బు మీద అధిక కాంక్ష కలిగి ఉన్నచోట, శత్రువు లు కలిగి ఉన్న చోట, అవసరమైనప్పుడు అప్పు ఇచ్చేవారు లేని చోట నిశ్చయముగా నివాసముండకూడదు. “అప్పిచ్చువాడు వైద్యుడు” అనే పద్యం ధోరణిలో చెప్పిన పద్యమిది. దాని కంటె కొంత ఎక్కువ పరిధిలో విస్తరించింది. ఈ రోజుల్లో మన మిలాంటి నియమం పెట్టుకుంటే నివసించటానికి చోటు దొరకటం ప్రశ్నార్థకమే కావచ్చు.

చ॥ పలుమరు శాస్త్రముల్చదిని పండితుడై యజరాణి సత్కృపా
ఫలమును గాంచి తా రసము బాగుగఁజెప్ప వలంతియైన వాఁ
డిల ఁగవి, లాతి వాఁడు కపియే యని చెప్పగనొప్పు జాయ నాఁ
గులజయ జాయగాని, పెఱకోమలి మాయయకాక జాయయే.

సాహిత్య వ్యాకరణాది శస్త్రాలను చాలసార్లు బాగా అధ్యయనం చేసి పండితుడై, సరస్వతీ దేవీ దయకు పాత్రుడై, రసవంతమైన వర్ణనలతో కవిత్వం చెప్పగలిగిన వాడే కవి అనిపించుకోదగును. దానికి భిన్నమైన వాడు ‘కపి’ అవుతాడు కాని కవి కాజాలడు.

మంచి వంశంలో పుట్టి వివాహమాడిన స్త్రీ భార్య అవుతుంది. కాని కేవలం వల పుతో దరి చేర్చుకున్న వేరుజాతి వనిత మాయ అవుతుంది కాని ‘జాయ’ కాదు కదా!

కం॥ పన్నిద్దఱు భాస్కరులని
యెన్నికసేయుటది కల్ల యిద్దఱుగాదా
మిన్నున నొక భాస్కరుఁడును
బన్నుగ వినుకొండ నున్న భాస్కరుఁడొకడున్

మహాదాతగా ప్రఖ్యాతి గన్న రాయన భాస్కర మంత్రిని పొగుడుచెప్పిన పద్య మిది. మన పురాణాల్లో పన్నెండు మంది భాస్కరులున్నారని చెప్పతారు. కాని ఆ మాట నిజముకాదు. నిజానికి ప్రపంచంలో ఇద్దరు భాస్కరులే ఉన్నారు.  వారిలో ఒకడు ఆకాశంలో వెలుగుతూ తన కాంతితో లోకాన్ని జీవింపజేస్తున్నాడు.రెండవ భాస్కరుడు భూమి మీదవినుకొండ పట్టణంలో ఉండి దాన, శౌర్యాది గుణాలతో ప్రకాశిస్తు న్నాడు అని భావము.

తే॥ వానిజన్మంబు సఫల మెవ్వాడు పీల్చు
ప్రాణవాయువు స్వాతంత్ర్య భరభరితమొ
పరుల మోచేతి గంజికై ప్రాకులాడు
వాని కంటెను మృతుడను వాడెవండు ?

మానవ జీవితంలో స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమైనదో వివరించే పద్యమిది. ఏమనిషి స్వతంత్రంగా, ఎవరిపై ఆధారపడకుండా, ఎవరికీ భయపడకుండా ప్రాణ వాయువును పీల్చగలుగుతాడో, అట్టి స్వేచ్ఛా జీవి జన్మమే సార్థకమైనది. ఒకరి మోచేతి కింది గంజికి, అనగా ఒకరి దయాదాక్షిణ్యాలపై గడిపే బ్రతుకు కోసం పాకులాడు వాడు చచ్చిన వానితో సమానం ప్రాణాలుండి కూడ మృతప్రాయుడైన జీవచ్ఛవం వంటివాడని అటువంటి బ్రతుకు వ్యర్థమని తాత్పర్యము.

ఆ॥ వారిజాక్షులందు వైవాహికము లందు
ప్రాణవిత్తమాన భంగమందు
చకిత గోకులాగ్ర జన్మ రక్షణ మందు
బొంకవచ్చునఘము పొందదధిప.

స్త్రీల వ్యవహారాలలో, పెండ్లికి సంబంధించిన మాటలలో, ప్రాణాలకు గాని, ధనానికి గాని, గౌరవానికి గాని భంగము కలిగే పరిస్థితులలోను, భయంలోఉన్న

గోవులను బ్రాహ్మణు లను రక్షించే విషయంలోను అసత్యం పలకటం వల్ల పాపమం టదనిదీని భావం. వామనావతార ఘట్టంలో శుక్రాచార్యులు బలిచక్రవర్తితో, వామను నికి దానమివ్వవద్దని చెప్పే సందర్భంలో అంటాడు. ఈ విధానం ప్రకారం మనం చాలాఅబద్ధాలను క్రమబద్ధం చేసుకోవచ్చు.

ఉ॥ కొందఱు భైరవాశ్వములు కొందఱు పార్థుని తేరిటెక్కముల్
కొందఱు ప్రాక్కిటీశ్వరుడు కొందఱు కాలుని యెక్కిరింతలున్
కొందఱు కృష్ణజన్మమున గూసిన వారలు నీ సదస్సులో
నందఱు నందఱే మరియు నందఱు నందఱె యందఱందఱే.

భైరవాశ్వములంటే కుక్కలు, అర్జునుని రథంపై జెండా కోతి, కిటీశ్వరులంటే వరాహాలు (పందులు) కాలుని ఎక్కిరింతలు (వాహనాలు) అనగా దున్నపోతులు, కృష్ణ జన్మ సమయంలో కూసినవి గాడిదలు. అందుకే అరవవద్దని వసుదేవుడు గాడిదకాళ్లు పట్టుకున్నాడనే వాడుక ప్రసిద్ధమైంది. ఈ సదస్సు (సభ)లో ఉన్న వారందరూ అందరే. కొందరు శునకాలు, ఇతరులు కోతులు, మరి కొందరు పందులు, కొందరు దున్న పోతులు, ఇంకొందరు గాడిదలు ఈ రీతిగా సభలోని వారందరూ అందరే అని ఆశువుగా పూరించాడు.

కం॥ ఆడిన మాటలు దప్పిన
గాడిద కొడుకంచు దిట్టగా విని యయ్యో!
వీడా నాకొక కొడుకని
గాడిద యేడ్చెంగదన్న ఘన సంపన్నా.

మనలో సామాన్యంగా ఎవరి మీదనైనా కోపం వస్తే వాణ్ణి 'గాడిద కొడుకా' అని తిట్టటం పరిపాటి. ఆడిన మాట తప్పినవాణ్ణి, అబద్ధాలు చెప్పేవాణ్ణి, 'గాడిద కొడుకా!' అని తిట్టినప్పుడు ఆ తిట్టును ఒక గాడిద విని, అయ్యో! ఛీ ॥ ఇటు వంటి ఆడి తప్పే వాడు నా కొడుకా ? ఎంత అవమానం ? అని సిగ్గుతో బాధపడిందట. అనగా ఆడిన మాట తప్పే వాడు గాడిద కంటే అధముడని చెప్పటం కవి తాత్పర్యం.

తే॥ పర్వతశ్రేష్ఠ పుత్రికా పతివిరోధి
యన్న పెండ్లాము నత్తను గన్న తండ్రి
పేర్మి మీరిన ముద్దుల పెద్దబిడ్డ !
సున్న మించుక తేగదే సుందరాంగి ॥

జ్యేష్ఠ, లక్ష్మి అక్క చెల్లెళ్లని, పెద్దావిడ దరిద్రానికి, రెండవ ఆమె సంపదలకు అది దేవతలని ప్రసిద్ధమే. ఓసీ! దరిద్రురాలా ! కొంచెం సున్నమిలా తే ! అని అతని పిలుపులోని భావం.

కం॥ శతపత్రంబుల మిత్రుని
సుతు జంపిన వాని బావ సూనుని మామన్
సతతము దాల్చెడు నాతని
సుతు వాహన వైరి వైరి ! సున్నం బిడిగో

ఆ॥ తేనె సోక నోరు తీయన యగురీతి
తోడ నర్థమెల్ల తోచకుండ
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగ చెవిటి వారి ముచ్చటగును.

మూగవాడు తనలోని భావాలను మాటల ద్వారా స్పష్టంగా వ్యక్తం చేయలేడు. ఇతరులు అతని సైగలు చూచి భావాన్ని సులభంగా గ్రహించలేరు. అట్లే చెవిటివాడు ఎదుటి వ్యక్తి చెప్పిన మాటలను సరిగా విని భావం గ్రహించలేడు.కనుక కవిత్వం కూడ లిత పదబంధాలతో, భావం స్పష్టంగా గ్రహింపదగినట్లు, రసవంతంగా రచించక పోతే అది మూగ, చెవిటివారు ముచ్చటలాడుకున్నట్లు అస్పష్టంగా,అయోమయంగా ఉటుందని మొల్ల కవితా స్వరూపాన్ని చాలా చక్కగా వర్ణించింది.

సీ॥ అరయంగ బరదేశ యాత్రసేయుట యొండు
తనకు దానే వండుకొనుట రెండు
కులపతి నెడ బాసి తొలగిపోవుట మూడు
వెలయంగ యాచక వృత్తి నాల్గు
తన సరివారి పంచమ జేరుకొనుటైదు
గుఱుతెఱుంగని రాజు గొల్చుటాఱు
చదువు నేర్వక యుండి సభకు బోవుట యేడు
వెన్న దారిద్ర్యంబు నెన్మిదవది.

ఉ॥ గంధపు చెట్టు క్రింద నురగంబు పయోనిధి బాడబాగ్ని, మా
కందఫలంబు క్రింద నొక కందురు దుంప, జగద్విలోక నా
నందము మేఘమందు బవి నాచిన మాడ్కినకారణంబుగా
నుందురు దాత సన్నిధి సయోగ్యులు కొందఱు మల్లికార్జునా ॥

మంచి గంధపు చెట్టు క్రింద పాము, సముద్రంలో బడబాగ్ని, మామిడి పండు క్రింద తేనెతుట్టె, లోకానికానందం కలిగించే మబ్బులో పిడుగు ఉండి ఆయా వస్తు వులను సులభంగా అందకుండా బాధకలిగిస్తాయి. అలాగే దానశీలుడైన ఉత్తముని దగ్గర అయోగ్యులైన కొందరు చేరి యాచకుల కందకుండా చేస్తారని భావము.

కం॥ అడిగెదనని కడువడిజను
నడిగిన(దను మగుడ నుడుగడని నెడనుడుగున్
వెడవెడ చిడిముడి తడబడ
నడుగిడు నడుగిడదు జడిమనడుగిడునెడలన్.

ఇది బమ్మెర పోతనగారి భాగవతంలోని పద్యము.ఇది సర్వలఘు కందం. 2, 4 పాదాల్లోచివర గురువు తప్పక ఉండాలి. కనుక గురువులు ప్రయోగించాడు. తక్కిన వన్నీలఘువులే.డకారం చాలసార్లు వెంటవెంట ప్రయోగించటంతో వృత్త్యనుప్రాసమనేశబ్దాలంకార సౌందర్యం కూడ శోభనిచ్చింది. పోతన గారికి శబ్దాలంకారాలపై మక్కువయెక్కువని విమర్శకులకు తెలిసిన విషయమే.దీనిలోమనస్సుకుసంబంధించిన భావవిహ్వలత కూడ చక్కగా వర్ణింపబడింది.

కం॥ ఉమెతక్కయ దినిసెపితో
క్రమమెరుగక వెఱ్ఱి పుచ్చకయ దినిసెపితో
ఎమిదిని సెపితివి కపితము
అమవసనిసి యన్నమాట అలసనిపెదనా

"కలనాటి ధనము లక్కర
గలనాటికి దాచ కమలగర్భుని వశమా
నెలనడిమినాటి వెన్నెల
యలవడునే గాదె బోయ నమనసనిసికిన్ "

అనే పద్యం చెప్పగా దానిలోని అమవసనిసి అనే ప్రయోగాన్ని వెక్కిరిస్తూ పై పద్యం చెప్పాడని ప్రసిద్ధి. అమావాస్యనిశి అన్నదానికి వికృతిగా "అమవసనిసి" అని ప్రయోగించటం జరిగింది. దానికి బదులుగా ఉమ్మెత్త కాయను 'ఉమెతక్కయ' అనీ, పుచ్చకాయను, 'పుచ్చకయ' అనీ, అల్లసాని పెద్దనను 'అలసనిపెదనా' అనీ లఘూకరించి హేళనగా చెప్పాడు. పై కాయలు తింటే వెఱ్ఱి వస్తుంది. కనుక నీవు

అవి తిని పిచ్చిగా ఇటువంటి పదం వాడావు అని రామలింగని భావం.

తే॥ పక్షివర్యుండు బరగు పంచాక్షరముల
వాని తలదీయ క్షుద్రదేవత జనించు
వాని తలదీయ తక్కెడ జాను మీరు
దాని ప్రథమాక్షరము దీయ దనరు నృపతి.

కం॥ శివుడద్రిని శయనించుట
రవిచంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవిరతమును రేషునిపై
పవళించుట నల్లిబాధ పడలేక సుమా

కం॥ పగరకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులెందున్
ముగురాడువార మైతిమి
వగపేటికి జలకమాడ వచ్చిన చోటన్

ఇది ఖడ్గతిక్కనకు సంబంధించిన చాటువు. ఒకసారి నెల్లూరి ప్రభువు మనుమసిద్ధికి, కాటమరాజుకు పోరు జరుగగా, ఖడ్గతిక్కన మనుమసిద్ధి పక్షానయుద్ధం చేస్తూ సైన్యం చిందరవందర కాగా రణరంగంవదలి ఇంటికి వచ్చాడట. అప్పుడతని భార్య తిక్కనకు స్నానానికి నీళ్ల తోడి, ఎలక మంచం అడ్డుపెట్టి, పసుపుముద్దను గూడ ఉంచిందట. అది చూచి ఏమిటి ? అని అడుగగాఈ పద్యం చెప్పింది."ఇప్పటి వరకు ఇద్దరమే స్త్రీల ముంటిమి ఇకముందు మనం ముగ్గరం ఆడవారమైనాము" అని హేళన చేసింది. ఆనాటి స్త్రీల అబిమానం, వీర పత్ని భావకామన దీనివల్ల తెలియవస్తు న్నాయి.నిజానికతడు పారిపోయిరాలేదు. బలాన్ని సమకూర్చుకొని వెళ్ళాలని తలచి వచ్చినాడు.

ఆ॥ ఆంధ్రభాష యమృత మాంధ్రాక్షరంబులు
మురువు లొలుకు గుండ్ర ముత్తియములు
ఆంధ్రదేశ మాయురా రోగ్యవర్ధకం
బాంధ్ర జాతి నీతినను సరించు.

తెలుగుభాష అమృతమని, (తెలుగు లిపి ముత్యాల వలె గుండ్రంగా పలుకులొలుకుతుంటుందని, తెలుగుదేశం ఆయురారోగ్యాలను పెంచే పాడి పంటల తో కూడుకొన్నదని, తెలుగు ప్రజలు నీతి ప్రవర్తన కలవారనీ పద్యం లోవర్ణించబడింది. ఆంధ్రదేశాన్ని భాషను, ఆంధ్రజాతిని  గూర్చి విశిష్టత దీనిలో కన్పిస్తుంది.

ఆ॥ చదువదెంతయున్న సంస్కార మింతగ
నెరుగకున్న నదియు చదువుగాదు
పరిమళమ్ము లేక పసలేదు పూలకు
వినుర శ్రీనివాస ! విబుధసూక్తి
(విబుధసూక్తి సుధాకరము)

చదువుకు సంస్కారానికుండే సంబంధాన్ని తెలుపుతున్నాడు కవి. ఎన్ని శాస్త్రాలు చదువుకున్నా, ఎన్ని డిగ్రీలు సంపాదించినా, మనిషి ఉత్తమ సంస్కారాన్నలవ రచుకొకపోతే ఆ చదువు చదువు కాదు. పూవు ఎంత అందంగా ఉన్నా, దానికి మంచి పరిమళం లేకుంటే మోదుగుపూవును వలె జనులాదరించరు కదా!

కం॥ ఎల్లరు మెచ్చని మత్కృతి
నుల్లంబున మెచ్చు గాక యొకడుష్ట్రకులం
బొల్లని పల్లవితామ్రము
కొల్లలుగా పొగడ నొక్క కోయిల లేదే.

తన కావ్యాన్ని మెచ్చని వారిని ఒంటెల వంటి వారని, తన కవిత్వం మామిడి చిగురు వంటిదని, రస హృదయుడైన ఒక్క పాఠకుడు మెచ్చుకున్నా చాలునని ఎంతో నేర్పుతో చెప్పాడు.

కం॥ గుడి కూలును నుయి పూడును
వడి నీళ్లం జెరువుతెగును, వనమును ఖిలమౌ
చెడనిది పద్యం బొకటియె
కుడి యెడమల గీర్తిగన్న గువ్వల చెన్నా

దేవాలయం కొంత కాలానికి శిథిలమై కూలిపోవచ్చును. మంచినీటి బావి కూడ కాలక్రమంలో పూడిపోతుంది. నీటి వరద తాకిడి ఎక్కువై చెరువు కట్ట తెగి పోవచ్చును. అందంగా నిర్మించిన పండ్లతోట కొన్నాళ్లకు శిథిలమౌతుంది. ఎంత కాలమైనా చెడనిది,నశించనిది పద్యమొక్కటే.అనగా కవిత్వమొక్కటే అని తాత్పర్యము.

" కుడి యెడమల కీర్తి గన్న" అనటం వలన గువ్వల చెన్నడు అన్ని వైపుల కీర్తి సంపాదించినాడని తెలుస్తున్నది.

కం॥ పరగడుపున సభలోపల
తరుణులయెడ భుక్తమైన తరి యొక విడెమున్
దొరకని నరునకు సౌఖ్యము
కరువప్పా కుందవరపు కని చౌడప్పా

ఆహారం తీసుకోక ముందు ఒకసారి, ఎక్కడికైనా సభలకు వెళ్లినప్పుడు, స్త్రీలతో సల్లాపాలలో ఉన్నప్పుడు, భోజనం చేసిన తరువాత ఈ సమయాలలో ఒక్క విడియ ము దొరకక పోతే ఆ పురుషునికి లోకంలో సుఖమనేది కరువే అవుతుంది అంటాడు చౌడప్ప కవి.

ఉ॥ మాయపు దుంటవిల్తు వెడమాయల మానిసులార! ప్రాణముల్
వోయెడు నాడు నాటికిక బోవిడుడీయలుకల్ నిజేపలం
బాయకుడీ యటంచు బరిభాషల జాటెడుభంగి కొక్కొరో
కోయని కూత వేసె దొలికోడి పురాంతర గేహదేహళిన్

తమ భర్తలపై అలిగి పడతులు వారికి దూరంగా ఉన్నారు. మన్మథుడు మాయల మారివాడు. అతడు పెట్టే బాధల వల్ల ప్రాణాలు పోతాయి. మన్మథబాణాల వల్ల విరహంలో ఉన్న వారి ప్రాణాలకు అపాయం కలుగుతుంది. అందు వల్ల మీరు అలుకను వదలండి, మీ భర్తలకు దూరం కాకండి అని వారిని హెచ్చరిస్తున్నదా ? అన్నట్లు కోడి కొక్కొరొకొ అని ఇండ్లలోపలి భాగాల్లో కూసిన దట. కవి భావనాశక్తి ఎంత అద్భుతంగా ఉన్నదో చూడగలం దీనిలో.

చం॥ కరిగమన ల్దురా త్ములనె కాని రమింపరు హీనజాతికా
పురుషుల గాని భూభుజులు ప్రోవరు కానలగాని మేఘముల్

కురియవు సత్యశౌచములకుం బెడబాసిన వాని గాని యిం
దిర వరియింప దుర్వి యవినీతుల గాని భరింపదెంతయున్

ఉ॥ ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహూకరింపగా
నొద్దికనాకొసంగుమని యొక్కరు గోరగలేదు లేరొకో
పెద్దన బోలు సత్కవులు పృథ్విని లేరని నీ వేరుంగవే
పెద్దన కీదలంచినను బేరిమినా కిడు కృష్ణరాణ్ణృపా.

శ్రీ కృష్ణదేవరాయ లొకనాడు బంగారు పళ్లెరములో గండపెండేరమనే ఆభరణా న్ని పెట్టి సభా భవనానికి తెప్పించి సంస్కృతాంధ్ర భాషలలో సమానంగా కవిత్వం చెప్పగలవారెవరైనా ఉంటే వారికీ బహుమానమిస్తానని ప్రకటించాడు. సభలో కొంత సేపటివరకు ఎవరూ ముందుకురాలేదు. అప్పుడు రాయలు పై పద్యంలో మొదటి రెండు పాదాలు చదువగానే అల్లసాని పెద్దన లేచి తక్కిన రెండు పాదాలు పూరించి నాడట. పెద్దన వంటి మంచి కవి మరొకడులేడని నీకు తెలియదా ? ఇవ్వదలిస్తే నాకివ్వు" అని పలికినాడాయన. "వెంటనే" పూత మొఖుంగులున్" అని మొదలు పెట్టి తకారప్రాసతో ఉత్పలమాలికను కొంత వరకు అచ్చ తెలుగు పదాలతో, తరువాత సంస్కృత పదాలతో మొత్తం 30 పంక్తుల నాళువు గా చెప్పాడాకవి. వెంటనే కృష్ణరాయ లు పెద్దన కాలికి స్వయంగా గండపెండేరము నలంకరించాడు.

చ॥ తెలియని వన్ని తప్పులని దిట్ట తనాన సభాం తరంబునన్
బలుకఁగ రాకురోరి పలుమారు బిశాచపుపాడె కట్టెనీ
పలికిన నోట దుమ్ముమ్మవడ భావ్యమెరుంగవు పెద్దలైనవా
రల నిరసింతురా! ప్రెగడరాణ్ణరసా! విరసా / తుసా! బుసా

నీకు తెలియనివన్ని తప్పులని అజ్ఞాన గర్వంతో మాట్లాడవద్దు. ఇతరుల పాండి త్యంపై గౌరవముంచి, తెలియనివి తెలుసుకోవాలి. పిశాచపు పాడెకట్టె, నీనోట్లో దుమ్ముపడ! అనేవి ఆవేశంలో పలికిన నిందా వాక్యాలు. పెద్దల నిరసించటం నీకు తగదని, తుసా, బుసా అని తిరస్కారంగా పలికాడు.

కం॥ వండగ నెండిన దొక్కటి
వండక మరి పచ్చిదొకటి వడికాలినదిన్
తిండికి రుచియై యుండును
ఖండితముగ దీని తెల్పుకవియుం గలడే.

వంటలో ఉడికించగా ఎండినదొకటి, (కాచు) వండకుండా పచ్చిగా ఉన్న దొకటి (తమలపాకు), బాగా కాలినది (సున్నము), ఈ మూడు కలిపితే తినటానికి చాలా రుచిగా ఉంటుంది. అదేమిటో తెలుపగల కవి ఉన్నాడా ? అని ప్రశ్న. తమలపాకు, సున్నము, కాచు, వక్క కలిపి విడియముకట్టి తినటానికి చాలా రుచిగా ఉంటుంది కదా !

చ॥ శరనిధి మేర దప్పినను శంకరుడిచ్చు వరంబు దప్పినన్
సురగురునీతిదప్పినను సూర్యుడు చంద్రుడు త్రోవ దప్పినన్
పరుస తనాన రాఘవుని బాణము దప్పిన హాస్యకాంధ్రలో
సరసుడు జాణ కుందవర చౌడుని పద్యము నీతి తప్పునే

ఉ॥ బాలరసాలసాల నవ పల్లవ కోమల కావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపు కూడు భుజించుట కంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతర సీమల కందమూలకౌ
ద్దాలికులైన నేమి నిజదారసుతోదర పోషణార్థమై

ఇది బమ్మెర పోతనగారి పద్యంగా ప్రసిద్ధము శ్రీనాథకవి, పోతన బావమరదుల నిప్రతీతి.శ్రీనాధుడు రాజాశ్రయాల్లో భోగ జీవితం గడుపుతుండగా, పోతన వ్యవసాయం చేస్తూ కవిత్వం వ్రాసేవాడు. ఆ సందర్భంగా శ్రీనాధుడు పోతనను గేలిచేయగాఆయన చెప్పిన సమాధానమిది.

కావ్య కన్య మామిడి చెట్టు లేత చిగురాకువలె కోమలమైనది. అటువంటి దాన్ని అధములైన రాజులకిచ్చి వారిచ్చిన డబ్బుతో పొట్టపోషించు కోవటం కంటె, కవులు నాగలి పట్టి పొలం దున్నితే ఏమి ? అడవులలో కందమూలాలు తవ్వు కొని జీవిసేమాత్ర మేమి ? భార్యాపుత్రులను పోషించటానికి కూతురు వంటి కావ్యా న్నమ్ముకోటంకంటె స్వతంత్ర జీవనమే మంచి దని పోతనభావం.

కం॥ మామా మీమో మామా
మామా! మిమ్మొమ్ము మామ మామా మేమా
మేమొమ్మము మీ మైమే
మేమే మమ్మోము మోము మిమ్మా మామా

నిరోష్ఠ్య, ఏకవ్యంజనాది నియమాలతో రచించిన పద్యాలలో అవ్యయక్లేశము, అర్థాన ప్రబోధలో శ్రమ తప్పవు. ఏకాక్షర నిఘంట్వాదులాశ్రయించక తప్పదు.

ఆ॥ నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చాటు పద్యమొకటి చాలదా ఇలలోన
విశ్వధాభి రామ వినురవేమ.

శ్రేష్ఠమైన మంచి నీలమణి ఒక్కటి చాలును. విలువ గల రత్నం నల్లనిదై నా అది ఎం తో శోభను ఇస్తుంది. ఊరకే పైపై మెరుగులున్న రాళ్లు బండెడుంటే మాత్రం లాభ మేమి ? పైపై మెరుగులు ఎన్నున్నా లోపల సారం లేకుంటే ఉప యోగం లేదు.శబ్దా డంబరం, ఆటోపం కలిగిన వంద పద్యాల కంటె చమత్కార దాయకమైన ఒక్క చాటు పద్యం చాలదా ? అని వేమన అంటున్నాడు."గంగి గోవు పాలు గంటెడైనను చాలు" అనే పద్యంలో చెప్పిన భావం వంటిదే దీనిలో చెప్పబడింది. లోపల సారం లేకుండా, మాటల చమత్కారంతో చెప్పే ఆడంబర కవిత్వం కంటె, మనస్సును రంజింప చేసే మంచి చాటు పద్యం ఎంతో మేలు కలిగిస్తుందని భావము.

ఆ॥ గోలకొండ మలక గోవుల భక్షించు
కొండవీటి విప్రకులము నెల్ల
బాచమరుసు చేరి భక్షించుచున్నాడు
మలకమేలా ? బాచమరుసుమేలా.

"గోలకొండ మలక అంటే గోలకొండ రాజ్యాన్ని పాలిస్తున్న తురుష్క రాజని అర్థం. మహమ్మదీయులు గోమాంస భక్షణం చేయటం సహజం. గోలకొండ నవాబు గోమాంస భక్షణం చేస్తుంటే, బాచమరుసు అనే మంత్రి కొండవీటి సీమ లోని బ్రాహ్మణులందరినీ భక్షిస్తున్నాడు అంటే బాధలు పెడుతున్నాడని భావం. వీరిద్దరిలో ఆ నవాబు మేలో, బాచమరుసు మేలో తెలియకున్నది" అని పలకలూరి గోపన్న అనే కవి ఈ చాటు పద్యంలో చెప్పాడు.

మ॥ వడపై నావడపై పకోడిపయి హల్వాతుంటిపై బూంది యోం
పొడి పై నుప్పిడిపై రవిడ్డిలిపయిం బోండాపయిన్నేమియీ
సుడిపైఁబారు భవత్కృపారసము నిచ్చో గొంత రానిమ్మునే
నుడుకుం గాఫిని, యొక్కగ్రుక్క గొనెవే యో కుంభదంభోదరా!

చిరుతిండ్ల మీద చాలా ఆసక్తి ఉన్న ఒక భోజన ప్రియుణిపై ప్రయోగించిన పద్యమిది.గారెల మీద, పెరుగు వడమీద, పకోడీల పైనా, హల్వా ముక్క మీదా, బూందీపైన,ఉప్మా మీద, రవ్వ ఇడ్లీల మీదా, బోండాపైన, సేమియా పాయసంపైనా నీ దయారసం చక్కగా ప్రసరించి, వాటన్నిటినీ ఓపిగ్గా ఆరగించావు కదా! కడవ వంటి ఉదరం కలవాడా! అటువంటి దయారసాన్నే నా మీద గూడ కొంచెం ప్రసరించి వేడి కాఫీని నన్ను గూడ ఆరగించు - నీకు నమస్కరిస్తున్నాను. నా కోరికను తిరస్కరించకు ! అని వ్యంగ్యహాస్యంతో ఎవరో కవి చమత్కరించి ఈ పద్యాన్ని రచించాడు.

సీ॥ రాజ నందన రాజ రాజాత్మజులు సాటి
తలప నల్లయవేమధరణిపతికి
రాజనందన రాజరాజాత్మజులు సాటి
తలప నల్లయవేమ ధరణిపతికి

ఇది చాలా తమాషాగా ఉన్నపద్యం. నాలుగు పెద్ద పాదాలు, క్రింది గీత పద్య పాదాలు కూడ ఒకే విధంగా ఉండి పునరుక్తి లాగా అనిపిస్తాయి. ఇది శ్రీనాథ కవి అల్లయవేమారెడ్డిని గురించి వ్రాసింది.

ఒకనాడు శ్రీకృష్ణ రాయల సభకు ఒక కవి పండితుడు వచ్చి, పై పద్యాన్ని చదివి, మీ ఆస్థాన కవులలో ఎవరైనా యీ పద్యాన్ని కర్థం చెప్పగలరా ? అని అడిగాడు.

అప్పుడు పెద్దనాది కవులు పద్యార్థాన్ని గూర్చి ఆలోచిస్తుండగా, తెనాలి రామ కృష్ణుడు వెంటనే లేచి ఆ కవితో, "అయ్యా! మీ పద్యానికి నేను అర్థం చెప్పుతాను. కాని ముందుగా నీవు ఈ పద్యానికి కర్థం చెప్పుము" అని ఇలా ఒక పద్యం చదివాడట. ఆ పద్యమిది.

సీ॥ మేకతోకకు మేక తోకమేకకు మేక
మేక తోకకు తోక తోకమేక
మేక తోకకు మేక తోకమేకకు మేక
మేకతోకకు తోక తోకమేక
మేక తోకకు మేక తోకమేకకు మేక
మేకతోకకు తోక తోకమేక
మేక తోకకు మేక తోకమేకకు మేక
మేక తోకకు తోక తోకమేక

గీ॥ మేక తొకతోక తొకతోక తోకమేక
మేక తొకతోక తొకతోక తోకమేక
మేక తొకతోక తొకతోక తోకమేక
మేక తొకతోక తొకతోక తోకమేక.

ఈ పద్యాన్ని కొంటె తనంతో రామకృష్ణుడు చదివాడని, దీనిలో అర్థమే ముండదని ఆ పండితుడు గ్రహించినాడు. కాని ఆ మాట అంటే, రామకృష్ణుడు దాని నేదో విధంగా సమర్థించి తనను నిరుత్తరుణ్ణి చేస్తాడని తలచి తప్పించుకుని వెళ్లటమే మంచిదని, సాయంకాలం మరల వచ్చి చెప్పుతానని అప్పటికి వెళ్లి తిరిగి రాలేదట. ఇది తెనాలి రామకృష్ణుని యుక్తి కుశలతకు దృష్టాంతంగా పరంపరగా ప్రచారంలో ఉన్నది.

కం॥ నడవకయె నడచివచ్చితి
నడచిన నే నడిచి రాను నడచెడునటులన్
నడిపింప నడవనేరను
నడవడికలు చూచి నన్ను నడిపింపరయా

కుటుంబ పోషణ సక్రమంగా నడువకనే ఇంత దూరం కాలినడకతో వచ్చి నాను జరుగు బాటుంటే నడిచిరాను నా స్వభావాన్ని, నడకను గమనించి, నా కుటుంబాన్ని నడిపించే శక్తి కలుగునట్లు తగిన సహాయం చేయండి అని చమత్కారంగా పద్యం లో వేడుకున్నాడా కవి.

గీ॥ రావణుని సంహరించియు రాజ్యమునకు
నంగనను గూడి యభిషిక్తుడై వెలుంగ
హారతిచ్చిరి ప్రేమతో హరుని ముద్దు
భార్యలిద్దరు, శ్రీ రామ భద్రునకును

ఏక పత్నీవ్రతుడుగా ప్రసిద్ధుడైన శ్రీరామునికి ఇద్దరు భార్యలున్నారనే విరుద్ధార్థం స్ఫురించే సమస్య నివ్వగా, దాన్ని కవి, సమయస్ఫూర్తితో వాక్యాన్ని విరిచి, శివుని భార్య లిద్దరు గంగా పార్వతులు శ్రీరామచంద్రునికి హారతినిచ్చి విజయాభినందనంతో

స్వాగతం చెప్పినారని చక్కగా పూరణ కావించినాడు. మోచెర్ల వెంకన్న కవి కావించిన సమస్యాపూరణమిది.

చ॥ ఇనసమతేజ! మీరు సెలవిచ్చిన పీఠము హేమరత్న సం
జననము, మేరు ప్రస్తరము చక్కగ దీర్చితి పక్షమయ్యె నే
ర్పున సుర కోటులం దిశల బొల్పుగ వ్రాయుచురాగ నేటికా
యినశశిబింబయుగ్మముదయించె దినాంతమునందు దద్దిశన్.

సూర్యచంద్రబింబాలు రెండూ ఒకేసారి సాయంకాలము ఆ దిక్కులో ఉదయించాయి అని సమస్యార్థము. అది వాస్తవ విరుద్ధము కదా. కవి దానికి చతురతతో క్రింది విధంగా అర్థాన్ని భావించి పూరణ కావించినాడు.

“సూర్యుని వంటి తేజస్సు కలవాడా! నీవు నాకాజ్ఞాపించిన దేవతా పీఠమును బంగారము, రత్నాలతో నిర్మిస్తున్నాను. పక్షము కింద మేరు పర్వత శిఖరమణి నిర్మించినాను. దేవతలందరిని ఆ యాదిక్కులలో శిల్పములుగా చెక్కుతూరాగా ఈ వేళటికి సూర్యచంద్రుల బింబాలను సాయంకాల సమయాన ఆ దిక్కున పీఠముపైన చిత్రించినాను” అని పద్యభావము.

కం॥ అత్తుగ దూరుపు బడమర
చిత్తరువు లిఖించి నిదురజెందితినౌరా
చిత్తరువు వ్రాయబోవలె
నుత్తరమున, భానుబింబ ముదయంబాయెన్

సూర్యుడు తూర్పు దిక్కున ఉదయించటం స్వాభావికం. ఉత్తర దిక్కున సూర్యోదయమైనదనే అర్థాన్ని సమస్య స్ఫురింప జేస్తున్నది. దానికి క్రింది కల్పనతో పూరణ చేయబడింది.

ఒక చిత్రకారుడు, చిత్రశాలలో తూర్పునుంచి పడమర వరకు గోడలపైన చిత్తరువులు వేసి పొద్దుపోవటం వలన వచ్చి నిద్రించినాడు. ఇక ఇప్పుడు ఉత్తరపు గోడపై చిత్తరువు వేయటానికి వెళ్లాలి, అప్పుడే సూర్యోదయమైంది. అంటూ త్వరపడుతున్నట్లు చక్కగా అతికే భావాన్ని పద్యంలో ఇమిడ్చినాడు కవి.

కం॥ కవి అల్లసాని పెద్దన
కవి తిక్కన సోమయాజి గణుతింపంగా
కవి నేను రామకృష్ణుడ
కవి యను నామంబు నీటి కాకికి లేదే.

ఇది తెనాలి రామకృష్ణుని పద్యంగా వాడుకలో ఉన్నది అల్లసాని పెద్దన మీద త నకున్న గౌరవాన్ని వెల్లడించాడీ పద్యంలో. తిక్కన సోమయాజి, అల్లసాని పెద్దన ఇద్దరూ చెప్పుకోదగిన కవులు - రామకృష్ణుడనే పేరుగల నేను కూడ కవి గా పేర్కొనబ డుతున్నాను. కవి అనే పదానికి నీటి కాకి అనే అర్థం కూడ ఉన్నది కదా. (క అంటె జలం, వి అంటే పక్షి) కవి అనే శబ్దం వాడుకలో ఉన్నంత మాత్రాన నేను వారిద్దరితో సమానుణ్ణి కాలేను. వారికి, నాకు కవితా శక్తిలో ఎంతో తారతమ్యమున్నది. అని రామ కృష్ణకవి తన వినయాన్ని చాటుకున్నాడు. నిజానికి తెనాలి రామకృష్ణుడు వారి అంతకాకున్నా, తక్కువ శ్రేణి కవి ఎంత మాత్రం కాదు. పాండురంగ మహత్యం అతనికి కీర్తిని తెచ్చిన ప్రబంధము.

ఆ॥ కవులు పొగడువేళ కాంతలు రతివేళ
సుతులు ముద్దువేళ శూరవరులు
రణముసేయు వేళ రాకొట్టి పిలుతురు
పాడియదియు మిగుల భజనకెక్కు.

కవులు ప్రభువులను, దాతలను పొగడే సమయంలో తమ కవిత్వంలో వారిని 'రా' అని సంబోధిస్తారు. అదే విధంగా తరుణులు తమ పతులను ఏకాంత శృంగార క్రీడలలో 'రా' అంటారు. పసిబాలులైన కొడుకులు తండ్రులను ముద్దుపలుకులతో ' రా' అంటారు. శౌర్యవంతులు యుద్ధం చేసెటప్పుడు ప్రతి పక్షం వారిని 'రా' అని సంబోధిస్తారు - విధంగా సంబోధించటమే ఆ సందర్భంలో న్యాయంగా ఉంటుంది. అది మనస్సుకు ఆనందకరంగా ఉంటుంది కూడ.

తే. ఇంటికిని వింటికిని ప్రాణమేది చెపుమ
కంట మింటను మనమేమి కాంచగలము ?
నవ్వు పువ్వు దేనిని గూడి పొలుపుగాంచు
ఒకటె రెండేసి ప్రశ్నలకు త్తరంబు.

దానికి సమాధానం 'నారి' అని. ఇంటికి ప్రాణం నారి అనగా ఇల్లాలు. ధనుస్సుకు ప్రాణం 'నారి' అనగా అల్లెత్రాడని అర్థం.

రెండవ ప్రశ్న - కంటిలో, ఆకాశంలో మనం దేన్ని చూస్తాము ? అని - దీనికి ప్రత్యుత్తరం - తారలు అని. కంటిలో తారలు అంటే కనుపాపలు, ఆకాశంలో తారలు అంటే నక్షత్రాలని అర్థము.

మూడవ ప్రశ్న - నవ్వు మరియు పువ్వు కూడ దేనితో కలిసి మనోహరంగా ఉంటాయి? అని సమాధానం 'వలపు' అనేది - నవ్వుకు, వలపు అనగా ప్రేమ అందాన్నిస్తుంది -

ఆ॥ వంగ తోట నుండు పరి మళ్లలో నుండు
జొన్న చేల నుండు చోద్యముగను
తలుపు మూల నుండు తల మీద నుండును
దీని భావమేమి తిరుమలేశ !

పద్యం చదువగనే ఒక అర్థం స్ఫురిస్తుంది - అదేమంటే, వంగతోటలో, వరిమళ్ల లో జొన్న చేలయందు, తలుపు మూలలోను, తలపైనను ఉంటుంది. అదియేది ? అని పాఠకులకు భ్రాంతిని కల్గించి సమాధానానికి తికమక పడేలా చేస్తుంది. కాని అసలు రహస్యం పదాల విరుపులోనే ఉన్నది - అది తెలుస్తే ఇక చిక్కుముడి తొలగిన ట్లే ఎలాగంటారా ? వంగ, తోటన్ ఉండు, తోటలో వంగ పైరుంటుంది - వరి, మళ్ల లో నుండు - మళ్లలో వరిపైరు ఉంటుంది. అలాగే జొన్న పైరు చేలలో, తలుపు, మూలయుండు, తల - పై భాగాన ఉంటుంది అని అవ్వయం చెప్పుకోవాలి.

తే॥ అందమున జూడ రాము బంటైన వాడు
నాగరకతకు జము వాహనమున కీడు
శుచికి హేమాక్షు జంపిన శూరుజోడు
వసుధలో లేడు మా బావ వంటివాడు.

బావ మరదులు పరిహాసాలాడు కోవటం, సరస సల్లాపాలు చేయటం లోకం లో సహజం. ఇది ఒక రసికుడు తన బావపై ప్రయోగించిన వ్యాజస్తుతి రూపమైన పరిహాసం.

మా బావ అందం విషయంలో రాముని బంటు - అనగా హనుమంతుని వంటివాడు, కోతి అని అర్థము ఇక నాగరకత విషయం చెప్పాలంటే అతడు యమ ధర్మరాజు వాహనానికి సాటి - అంటే దున్నపోతు వంటి వాడని భావం. పరిశుభ్రత విషయంలో హిరణ్యాక్షుణ్ణి చంపిన శూరుని వంటి వాడు. వరాహ రూపంలో విష్ణువు హిరణ్యాక్షుని చంపాడు కదా! అందువలన పంది వలె శుభ్రం గా ఉంటాడని అర్థము - అటువంటి మా బావతో సమానుడు భూమిలో మరొ కడు లేడని పరిహాసోక్తి.

ఆ॥ కరయుగంబు గలదు చరణంబులా లేవు
కడుపు, నడుము, వీపు, మెడయు గలవు
శిరము లేదు గాని నరుల బట్టుక మ్రింగి
సొగసు గూర్చు దీని సొగసు గనుడి.

ఇది ఒక పొడుపు పద్యం."రెండు చేతులున్నాయి కాని కాళ్లు లేవు. కడుపు, నడుము, వీపు కూడ ఉన్నాయి - మెడ ఉన్నది కాని తలలేదు అయినా మనుష్యులనాక్రమించి మింగేస్తుంది - పైగా మనిషికి అందాన్ని కలిగిస్తుంది"అది ఏమిటో చెప్పకోండి.
దీని జవాబు - చొక్కా.

సిరిగలవానికి చెల్లును
తరుణుల పదియాఱువేలద!గ పెండ్లాడన్
తిరిపెమున కిద్దరాండ్రా
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్.

ధనవంతుడు (లక్ష్మికి భర్త అయిన విష్ణువు) పదహారు వేలమందిని పెళ్ళి చేసుకున్నా ఫరవాలేదు. కానీ బిచ్చగాడికి ఇద్దరు భార్యలెందుకు ? పరమేశ్వరా! నీకు పార్వతి చాలు గంగను విడిచిపెట్టు. (పల్నాటిలో నీళ్లు దొరకక శ్రీనాథుడు చెప్పిన చాటు పద్యంగా ఇది ప్రసిద్ధం).

తీముతామె వత్తు రర్థులు
క్రమ మెరిగిన దాత కడకు ! రమ్మన్నారా
కమలంబులున్న కొలవికి
భ్రమరంబుల నచ్చుతేంద్ర రఘునాథ నృపా ?

ఔచిత్యం తెలిసిన దాత వద్దకు అర్థులు తమంత తామే వస్తారు. ఎవరూ పిలవ పంపినపనిలేదు. పద్మాలు ఉన్న కొలనుకు తుమ్మెదలను ఎవరూ పిలవరు కదా! (తంజావూరు రఘునాథ రాయల ఆస్థానానికి వచ్చి క్షేత్రయ్య చెప్పిన చాటువుగా ప్రసిద్ధం.)

ఒక్కడు మాంసమిచ్చె మఱియొక్కడు చర్మము గోసి యిచ్చె వే
ఱొక్క రుడస్థినిచ్చె నిక నొక్కడు ప్రాణములిచ్చె వీరిలో
నొక్కొక పట్టునన్ బ్రదుక నోపక యిచ్చిరో కీర్తి కిచ్చిరో
చక్కగ జూడు మంత్రి కుల సంభవ ! రాయనమంత్రి భాస్కరా !

ఒకరు శరీరం నుండి మాంసాన్ని కోసి ఇచ్చారు. ఒకరు చర్మంకోసి ఇచ్చారు. మరొకరువెన్నెముక ఇచ్చారు. ఇంకొకరు ప్రాణమే ఇచ్చారు. వీళ్లంతా బతుకలేక ఈ పనులు చేశారా ? కీర్తి కోసం చేశారా ? ఓ మంత్రి కులంలో జన్మించిన రాయస భాస్కరుడా! బాగా ఆలోచించి చూడు.(రాయన భాస్కరుడు ఒక మంత్రి ఈయనను సంబోధిస్తూ చాలా చాటువులు ప్రచారంలో ఉన్నాయి).

ఒక పావురాన్ని కాపాడడం కోసిం శరీరం నుండి మాంసాన్ని కోసి ఇచ్చినవాడు శిబి చక్ర వర్తి. ఇంద్రుడడిగితే సహజ సిద్ధమైన కవచ కుండలాలను కోసి ఇచ్చానవాడు కర్ణుడు. రాక్షస సంహారానికి ఇంద్రునికి ఆయుధంగా తన వెన్నెముకను ఇచ్చిన వాడు దధీచి. వామనుడడిగితే ప్రాణమే ఇచ్చినవాడు బలిచక్రవర్తి.వీళ్ళంతా త్యాగధనులు మహాదాతలు.

రాజును రాజుగా డతడు రాహు ముఖంబున జిక్కె, వాహి నీ
రాజును రాజు గా డతడు రామ శరాహతిఁ దూలె, దేవతా
రాజును రాజుగా డతడు రావణసూతికి నోడె నాజిలో,
రాజన రాజు మల్కి యిభరాముడె రాజు ధరాతలంబునన్

రాహువు మింగుతాడు కాబట్టి పేరుకు రాజే కాని నిజంగా చంద్రుడు రాజు కాదు. నదులన్నిటికీ రాజైన సముద్రుడు కూడా రాజు కాదు. ఎందుకంటే రాముడు విల్లెక్కు పెట్టగానే వణకిపోయాడు. దేవతల రాజైన ఇంద్రుడు కూడా రాజుకాదు,

ఎందుకంటే రావణుని కుమారుడైన మేఘనాధుని (ఇంద్రజిత్తు) చేతిలో ఓడిపోయాడు. మరి యుద్ధంలో నిజమైన రాజెవ్వరు ? ఈ ప్రపంచంలో ఇబ్రహీం కుతుబ్షాయే నిజమైన రాజు. అంటే రాజు అనే పదానికి అతడే తగిన వాడు.
(ఈ పద్యం కందుకూరి రుద్రకవి రచించింది).

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చు చుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియ గట్టి

భరత ఖండం ఒక చక్కని పాడి ఆవు. భారతీయులు లేగదూడలు. ఏడుస్తూ ఉన్న ఈ లేగ దూడల మూతులు బిగగట్టి తెల్లవారు అనే గడసరి గొల్లవారు పాలు పితుక్కుంటున్నారు. (రాజమండ్రి కాంగ్రెసు సభలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యసించినప్పుడు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఆశువుగా చెప్పిన పద్యం).

శివుడద్రిని శయనించుట,
రవి చంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపైఁ
బవళించుట నల్లిబాధ పడలేక సుమీ.

శివుడు హిమాలయ పర్వతం మీద శయనిస్తాడు. సూర్యుడూ చంద్రుడూ ఆకాశంలో ఉంటారు. విష్ణువెప్పుడూ పాలసముద్రంలో శేషతల్పంమీద పండుకుంటాడు. వీరంతా భూమిమీద ఉండకుండా ఆయా చోట్ల ఉండడం నల్లికి భయపడే - అని చమత్కారం.

మనం పడే నల్లి బాధ ఎంత భయంకరమైందో తెలియ జెప్పడానికి ఇంత గొప్ప దేవతలూ కూడా నల్లి బాధ పడలేకనే అటువంటి నివాసాలేర్పరచుకున్నారని ఒక కవి చమత్కరించాడు.

అక్షరంబు వలయు కుక్షి జీవనులకు
నక్షరంబు జిహ్వాకిక్షురసము
అక్షరంబు తన్నురక్షించుగావున
నక్షరంబు లోకరక్షితంబు

మానవులకు చదువు కావాలి.  చదువు నాలుకకు చెరకు రసం వంటిది.చదువు మనల్ని రక్షిస్తుంది.  కాబట్టి దాన్ని మనం రక్షించాలి.

చదువు మట్టు పడును, సంస్కృతి చెడిపోవు
సంపదలు తొలంగు, సౌఖ్యముడుగా,
గౌరవంబు వోవు, గావున సోమరి
తనము కన్న హీన గుణము గలదె ?

సోమరితనంవల్ల చదువు అణగారిపోతుంది, సుఖం నశిస్తుంది. సంపదలు తొలగిపోతాయి. సంస్కారం చెడిపోతుంది.  గౌరవముండదు. అందుచేత సోమరితనం చాలా చెడ్డ అలివాడు.

రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటుగొల్వఁబాల్పడి రకటా!
సంజయ! ఏమని చెప్పుదుఁ
గుంజర యూధంబు దోమకుత్తుక జొచ్చెన్.

శత్రువులను జయించగలిగిన వారైనా పాండవులు శోభను కోల్పోయి విరటుని సేవించ టానికి పూనుకొన్నారుగదా ! ఓ సంజయా! నేనేమని చెప్పేది ? ఏనుగులగుంపు దోమ గొంతుకలో ప్రవేశించినట్లైంది.

కుప్పలు కావలిగాయగ
చెప్పులు కఱ్ఱయును బూని శీఘ్రగతిం దాఁ
జప్పుడగుచు వచ్చెడి వెం
కప్పను గని ఫణివరుండు గడగడ వణకెన్

కప్పను చూచి పాము గడగడ వణకిందన్న సమస్యకు ఈ పద్యం పూరణం.  పద్యంలో ఉన్న కప్ప, వెంకప్పగా మారి కుప్పలు కాపలా కాయడానికి బయలుదేరి,  చెప్పులూ కర్రా ధరించి చప్పుడు చేసుకొంటూ పామును గడగడ వణకజేసింది.

ఇలలో నిద్దరు రాజులు
మలయుచుఁ జదరంగ మాడి మాపటివేళన్
బల మెత్తి కట్ట మరచిన
నెలుకలు తమ కలుగులోని కేనుగునీడ్చెన్

ఎలుకలు తమ కన్నంలోనికి ఏనుగును ఈడ్చుకెళ్ళాయి అనే మరో సమస్యా పూరణం. ఇద్దరు రాజులు పట్టుదలతో చదరంగమాడుతున్నారు. రాత్రి అయింది. బలాన్ని (చదరంగబలం) ఎత్తి కట్టకుండా ఎలా ఉన్నవలానే వదిలేశారు. ఆ చదరంగ బలంలోని ఏనుగును ఎలుకలు తమ కన్నంలోకి ఈడ్చుకొని పోయాయి.

ఒడలి నిండ కన్నులుండు నింద్రుడు కాడు
కంఠమందు నలుపు ! కాడు శివుడు!
ఫణులబట్టి చంపు పక్షీంద్రుడా ? కాదు
దీని భావమేమి తెలిసికొనుడు.

ఇది పద్యరూపంలో ఉన్న పొడుపు కథ.  ఒళ్ళంతా కళ్ళుంటాయి కాని ఇంద్రుడు కాడు. మెడ నల్లగా ఉంటుంది కాని శివుడు కాడు. పాములను పట్టి చంపగలడు కాని పక్షిరాజు గరుడుడు కాదు.  ఇదేమిటి ! (జవాబు ; నెమలి)

పదములారు కలవు బంభరంబా, కాదు;
తొండముండుఁగాని దోమకాదు;
ఱెక్కలుండుఁగాని పక్షిగానేరదు;
దీనిభావమేమి తెలిసికొనుడు.

ఆరుకాళ్ళున్నాయి గాని తుమ్మెద కాదు. తొండం ఉంటుంది గాని దోమమాత్రం కాదు. ఱెక్కలుంటాయి కాని పక్షికాదు. ఇదేమిటి? (జవాబు ; ఈగ)